# బండలు

మస్కుల్నే లేసిన వీరాచారి మంజన్‌తోని పండ్లుతోముకొని బాయికాడ తానం జేసిండు. బాయి గిర్క సప్పుడుకు కోడలు యశోద గులుక్కుంట లేసింది. 'ఈ ముసలోనికిప్పుడు చాయపెట్టియ్యాలె... రోజుగిదే పీకులాట... గిట్ల ఎన్నిరోజులో... ఆ బొమ్మలు చెక్కుడు అయేవరకు ఎన్ని రోజులైతదో...' అనుకుంట స్టవ్ అంటువెట్టి రాత్రి దాసిపెట్టిన పాలల్ల ఇంత చాయపత్త, చక్కెర పారేసింది.

వీరాచారి తానమైనంక బొట్టువెట్టుకొని... జంజెం సవరిచ్చుకొని దేవుడి పోటువల ముందు కూసోని పూజ చేస్కున్నడు. యశోద చాయకోపు తెచ్చిపెట్టింది.

వీరాచారి చాయతాగి... ఉలి, సుత్తె దీస్కొని పడుకోబెట్టిన సీతమ్మ విగ్రహం ముందు కూసున్నడు. దాదాపు పూర్తి అయింది. ఓ మూలకు రాముని విగ్రహం... ఇంకో మూలకు లక్ష్మణుడు హన్మంతుడు విగ్రహాలు కూడా పూర్తి కావచ్చినయ్... ఇంకా నర్సింహమూర్తి, నారాయణచారి, రామస్వామి, వెంకటేశం రాలేదు. సీతమ్మ రాములోడి విగ్రహాలు తప్ప మిగతావి వాళ్లే చెక్కుతున్నారు. అవేగాక ఇంకా కొన్ని చిన్న చిన్న నవగ్రహాల విగ్రహాలు అక్కడక్కడా పడి వున్నయ్... కొన్ని సగం చెక్కినయి, కొన్ని పూర్తయినయి అన్నీ కల్సి ఇరవై, ముప్పయ్ దాకా వుంటాయ్.

గొల్లపెల్లికాడ రాములవారి గుడికడ్తుండ్రు... దాని కోసం ఈ విగ్రహాలు. అన్నీ పూర్తయితే ఇంకో నాలుగువేలిస్తారు. పని దొరుకక దొరుకక దొరికింది. ఇప్పటికి అయిదు వేలిచ్చిండ్రు... మొత్తం విగ్రహాలకి కలిపి తాను పదిగేను వేలు జెప్తే.. గిట్టిచ్చి గిట్టిచ్చి తొమ్మిదివేలకు దించిండ్రు. అది కూడా... విగ్రహం చెక్కుడు ఎంత కష్టమో చెప్పిండు. వచ్చిన పెద్దమనుషుల్ని బోడగుట్టకు తీసుకపోయిండు. వీరాచారి వెంట మనవడు సుధాకర్‌కూడా వచ్చిండు. సుధాకర్‌కు ఎప్పుడో ఆశచెప్పిండు. క్రికెట్ బ్యాటు కొనియ్యి తాతా అంటే... ఎవలన్న విగ్రహం చెక్కుమండ్రని వచ్చి పైసలిచ్చిండ్రనుకో..గండ్ల కెల్లి నీకు రెండువందల రూపాయలు ఇత్తలియ్‌రా... అని... ఎనిమిది నెలల్నుంచి తాతకు గిరాకి రావాలని సుధాకర్ ఎదిరి సూత్తనే వున్నడు. ఇగో గిప్పుడచ్చింది... వాళ్లు అడ్వాన్స్ ఇస్తే రెండు వందలు యాదికిజెయ్యాలని సుధాకర్ గూడా బోడగుట్టకచ్చిండు. వీరాచారి వచ్చిన అయిదుగురు పెద్దమనుషులకు విగ్రహాలు చెక్కాలంటే ఎంత నియమ నిష్టల్తోని

వుండాల్నో చెప్తుండు. అన్ని రోజులు మాంసం ముట్టద్దు... కల్లు తాగద్దు... పూజ చేసుకోంది ఉలి పట్టుకోవద్దు అని చెప్తండు.

బోడగుట్ట సగం ఎక్కేసరికే దమ్మొత్తంది. పేరుకు బోడగట్టేగాని... పెద్ద పెద్ద బండరాళ్లున్నయ్... గుట్ట మీదికెక్కినంక చుట్టు పొలాలు... తాడిచెట్లు... ఈదులు... మామిడితోటలు... సుధాకర్ ఆ అందాల్ని చూసి మురిసిపోయిండు.

వీరాచారి తాతకు ఓ బండ చూపిచ్చి ఒకాయినె "గీ బండతోని రాముని విగ్రహం చెక్కుంద్రి... మంచిగున్నట్టుంది" అన్నడు. తాత ఆ రాయిని సుత్తెతో రెండు దెబ్బలు కొట్టి నవ్వేండు" ఇది రాముని విగ్రహానికి పనికిరాదు ఇది ఆడి బండ" అన్నడు.

"బండల్ల కూడా ఆడయ్, మొగయ్ ఉంటాయా" అన్నాడొకాయన.

"అవును సప్పుడుతోని, రంగుతోని ఆ బండ ఆడిదో, మొగదో, ఆడగుల్లదో తెల్తది" అన్నడు వీరాచారి.

"ఏంది? బండల్ల ఆడిగుల్ల బండలు గూడుంటయా" ఇంకొకాయన నవ్వుకుంట అడిగిండు. సుధాకర్‌కు గూడా కొత్తగనిపించింది.

"అవును... మొగబండని కొట్టినప్పుడు ఇత్తడి గంటలు కొట్టినట్టు గణగణ మని సప్పుడత్తది... ఆడ బండని కొట్టినప్పుడు గంభీరమైన సప్పుడత్తది. ఆడగుల్ల బండని కొడితే తపతప మని సప్పుడు ఇనత్తది" అని కొన్ని బండల్ని కొట్టి సూపిచ్చిండు.

ఆల్లకు అన్ని సప్పుడ్లు ఒకలెక్కనే ఇనచ్చినయ్...

వీరాచారి బేరం కోసం గుట్టంత తింపుతున్నడనుకున్నరు... విగ్రహాలను

ఎట్లపడితే అట్ల గాకుండా 'తాళపద్ధతి' లో చెక్కాలని ఇడమర్సి చెప్పిండు. అరచేతి కొలతననుసరించి తాళ వుంటుందని, మడికట్టుకొని ఒక్కపొద్దుండి పవిత్రంగా చెక్కాలని ఇంకా చెప్పిండు. ఎర్రటి ఎండల ఎన్ని చెప్పినా... ఆల్లు తొమ్మిది వేలకు మించి ఇచ్చుడు కుదురదన్నరు.

"గుడి కట్టుటానికే మస్తు ఖర్చయితున్నయ్... మల్ల విగ్రహాలు ప్రతిష్టించంగ బాపండ్లకు మస్తువెట్టాలే... అన్నదానం చెయ్యాలె... యంత్రం పెట్టెటాయనె ఎన్ని వేలడుగుతడో తెల్వది..." 'రసకుంభ'ను పెట్టుడంటె వట్టి మాటలు గాదు. నూట యాభయ్ సంవత్సరాలు వుండేదాయె. గుడి మొదలు వెట్టేముందు 'గర్భాన్యాస' చేసినందుకే మస్తు ఖర్చయింది. నీకు తెల్వందేముంది వీరాచారి... ఇగ తొమ్మిది వేలకు ఒప్పుకో.. దేవున్ని నిలవెట్టిన్రోజు నీకు పట్టుదోతి వెద్దం తియ్.." అన్నడు మరో పెద్ద మనిషి.

"అది కాదుండ్రి... నేనొక్కన్నే విగ్రహాలు చెక్కనుగదా... సీతారాములు నేను చెక్కుత లక్ష్మణుడు, ఆంజనేయుల్ది మా నర్సింహాచారి, రామస్వామి, నారాయణ చెక్కుతరు. వాళ్లకు గూడా పైసలియ్యాలే గదా... ఎంత జాగర్తగా చెక్కాల్నో మీకు దెల్వది... ఈ బండల్ని ట్రాక్టర్ల మా ఇంటికి జారగొట్టుటానికే వెయ్యి రూపాయలు పోతయ్... ఉలులు మొండి వారుతయ్... సుత్తెలు పలిగిపోతయ్... పనిముట్లకే ఆరేడు వందలు ఖర్చయితయి... ఓపిక తోని చేసేపని... కండ్లల్ల చిన్నరాయి ఎగిరచ్చిపడ్డా... కండ్లువోతయ్..." అన్నడు.

వీరాచారి వృద్ధ శరీరం గుట్ట దిగుతుంటె ఆయాసపడుతోంది.

"తాతా.. ఒప్పుకోయే..." సుధాకర్ మెల్లంగ చెవిలజెప్పిండు... సుధాకర్ కండ్లల్ల క్రికెట్ బ్యాట్ కనవడ్తంది. వీరాచారి విగ్రహాలు చెక్కక... పని దొరుకక

యాడాదిన్నరయింది. రానికాడ రాయి అన్నట్టు తొమ్మిదివేలకే ఒప్పుకున్నడు వీరాచారి. లేకుంటె వాళ్లు రామడుగు శిల్పుల దగ్గరికి పోయేటట్టున్నరు. వీరాచారి ఇంటికి వచ్చినంక అయిదువేలు అడ్వాన్స్‌గా ఇచ్చింద్రు... మూన్నెల్లల్ల విగ్రహాలు చెక్కియ్యాలె... అని చెప్పి పోయింద్రు.

అంత డబ్బు చూడక ఆ కుటుంబం కొన్నేండ్లయితది. వీరాచారి కొడుకు దుబాయ్‌వోయిండు. ఆజాద్‌వీసా మీద పోయి ఆర్నెల్లయినంక అక్కడ పోలీసులకు దొరికి పోయిండట. యాడాదినించి అక్కడి జైల్లనే వున్నడట. ఇది యాదికచ్చినప్పుడల్లా వీరాచారి కండ్లల్ల నీల్లు తిరుగుతయ్.

'ఎంత వద్దన్నా వినకపాయె... పెండ్లాం పోరువెడ్తే పరాయిదేశం పాయె... కొడుకు ఇరుకున పడే' అని కుమిలిపోతుంటాడు.

పనిలో నిమగ్నమై విగ్రహం తదేకంగా చెక్కుతున్నప్పుడు... ఇంట్లో యశోద శోకం పెడ్తది... దాంతో కొడుకు గుర్తొచ్చి ఉలి పట్టు తప్పుతది... సుత్తె జారిపోతది... విగ్రహం చెదిరిపోతదేమోనని భయం భయంగా పని ఆపేస్తాడు. పందిరి కింద రాతిని ఒలిచే చప్పుళ్లు ఆగిపోయి గుండె చప్పుల్లు విన్పిస్తయ్... మిగతా వాళ్లు కూడా పని ఆపేసి సొదీ ముచ్చట్లల్ల పడుతరు... ఆరోజు పనంత మునుగుతది...

"ఊదువత్తీల వాసనత్తంది... పని మొదలువెట్టినావె బాపు..." అనే మాట వినిపిచ్చి... ఆలోచన్లకెల్లి బయటపడ్డడు వీరాచారి.

కాపోల్ల నర్సయ్య పొలానికి నీళ్లువెట్టి ఇంటికిపోవుకుంట ఆగిండు. రోజు మబ్బుల వోంగ వీరాచారి దగ్గర కూసుంటడు.

"విగ్రహం పూర్తయిందిరా నర్సన్నా... ఎందుకైనా మంచిదని పదిగేను

రోజుల ముందే చెక్కిన... ఆకురాయితోని నున్నగ రాకుతున్న..." అన్నడు వీరాచారి. నర్సయ్య వచ్చి విగ్రహం తలాపుకు కూసున్నడు.

"పొలానికి నీల్లు కట్టినవారా... డిపిటి పెట్టినవేమో... నీల్లు చాలుతున్నయా?" అనడిగిండు వీరాచారి.

"ఎక్కన్నే... దొంగరాత్రి త్రీఫేజు కరెంటిత్తండ్రు.... అదీ రెండు గంటలు... రాత్రి మూడు గంటల్నుంచి తెల్లారంగ అయిదిటిదాక... పొలంకాన్నే పండుకోవడ్తి... ఇగో గిప్పుడత్తన్న... పన్నెండెకురాలు వరి పెట్టిన... కరెంటు మోటర్‌తోని ఏడెకురాలన్న పారకముందె కరెంటు పోవట్టె... మల్ల గా మోత్కూరి అంజన్నది ఆయిల్ ఇంజన్ కిరాయికిదెచ్చి పారిత్తన్న..." అని చెప్పిండు.

"మొత్తానికి పొలాన్ని ఓ రేవుకు దెచ్చినవ్‌రా నర్సన్నా.." అని మెచ్చుకున్నడు వీరాచారి. నర్సయ్య ముఖంల గర్వం మెరిసింది.

"నీకు దెల్వదానె బాపు... దొర దగ్గరకొన్నంక అయిదేండ్లు అర్వగోసపడ్డం... నాలుగు నెల్లు నేను నా పెండ్లాం పోరగాండ్లు ఆ భూమిల రాళ్లు ఏరేసుటానికే సరిపాయె. ఎత్తుగడ్డలన్ని సాపు జేసినంతకాలం... నాకెన్ని బూర్లతేల్లు కుట్టినయ్... పొంపడిగె చెట్లు ఎన్నుండె... నా పెండ్లానికైతె చేతులకు బొగ్గలచ్చి అన్నం తినరాలేదు... ఒక్క ఫసల్ తీసేసరికి పల్లేరు కాయల్ల బోర్లిచ్చినట్టయింది గాదె బాపు... నీకు దెల్వదా..." అన్నడు.

"నీ పెండ్లాంది కూడా కష్టపు పుట్టువడిరా నర్సన్నా... కాయిపాయి చేసుకతినే ఆడిది కాదు... బొగ్గె పల్లేరుగాయలు పోసుకొని పుట్టిందిరా పాపం" అన్నడు.

"ఆ భూమి కొన్నప్పుడు ఎందరు బెదురువెట్టింద్రే... గా భూమెందుకు కొన్నవ్‌రా... అది రాళ్లబొడుగ... అండ్ల ఎవ్‌సం జెత్తె ఉసికెల ఉచ్చబోసినట్టే అని... అటెనుక... పొలం పచ్చవడితె కండ్లు పచ్చవడ్తయన్నట్టు... గిప్పుడు ఊర్లె కొందరు నేనేదో మోతుబరి అయిన అనుకుంటుంద్రు గని... నీకు తెల్వదానె బాపు... ఇద్దరాలు మొగలం ఎనిమిది గజాల బాయి తోడినం... చిన్న పోరగాండ్లు మట్టి ఎత్తి పారవోసింద్రు... చేనును పొలంగ మార్చుటానికి, గట్టువెట్టి మడులు జేసెటాల్లకి బొక్కల్ల పూలుగు ఎండిపోయిందనుకోరాదు... మొదటి పంట మొత్తం అప్పులకే వాయె... గిది రెండో పంట... మేం సుకపడకపోయినా మా పోరగాండ్లకన్నా ఓ నీడ జేసిన అన్న తుర్తి మిగిలిందే బాపు..." అన్నడు నర్సయ్య.

"కష్టపడ్డోనికి ఫలితం ఏడికిపోదు బిడ్డా... బోడగుట్టెక్కి సూత్తె నీ పొలానికి జిట్టిగొడ్తదిరా నర్సన్నా... గట్ల కనవడ్తుంది. నెలకింద జూసిన..." చెప్పిండు వీరాచారి.

ఇంకా పూరాత్తిగ తెల్లారలేదు...

పనిపాటలోల్లు ముచ్చట్లు వెట్టుకుంట పోతుంద్రు... చెంబట్కపోయేటోల్లు ముంతలు పట్టుకొని పోతుంద్రు.... యశోద బియ్యం కడిగిన పసిగడుగులు కుడితికుండల పోసుకుంట... 'నర్సన్నా... చాయె తాగుతావె...' అనడిగింది.

"కొంచెం పొయ్యి బిడ్డా... ఉడుకునీళ్లు పడితె పానం ఉషారైతది" అన్నడు. అప్పుడే రామసామి వచ్చిండు. తానం జేసినట్టున్నడు.. పెయ్యినిండ ఊబిదిరేఖలు గీసుకున్నడు... పెద్ద బొట్టువెట్టిండు. రాంగనే ఆంజనేయుడి విగ్రహం దగ్గర కూసుండి... నవ్వుకుంట...

"వీరన్నా... నీ మనవడు జూసినావె... ఆంజనేయుని చేతిల గదకు బదలు కిర్‌కెట్ బ్యాటు వెట్టిపోయిండు... తీట పొల్లగాడె..." అన్నడు. విగ్రహాంలన్ని తుడిచి

మొక్కి ఉలి, సుత్తె తీస్కున్నడు.

"ఆనికి పొద్దుగాల్ల లేత్తె కిర్‌కెట్ పిచ్చి... ఓన్మాలు రావుగని... ఇంట్ల టీవీల చేసుకుంట సీటీలు కొడ్తడు" అన్నడు వీరాచారి.

"మా పోరగాండ్లు సుత గట్లనే తయారైంద్రే... సిర్రగోనెల్లేకపాయె... ఒనబద్దీల్లేకపాయె... కాసెపుల్ల, కప్పతల్లి, రేస్సు, టొక్క, జాజిరి, దాల్‌దడీ, బొంగురాలాట... ఒక్కటన్న కనవడ్తుందా... పిల్లి కోన్నెత్తుకపోయినట్టు కిర్‌కెట్ పాడుగాను... మొత్తం ఆటల్ని మింగేసింది" అన్నడు నర్సయ్య.

యశోద రెండు గ్లాసుల్ల చాయ దెచ్చింది. ఒకటి నర్సయ్యకిచ్చి, ఇంకోటి రామసామికిచ్చింది.

"ఇప్పుడే తాగచ్చిన బిడ్డా... పూజయినంక నేనే పెట్టుకున్న... మీ వదినె ఇవతలున్నది" అన్నడు రామసామి.

"ఏంకాదు... తాగరాదె... గిప్పుడు చాయె తాగింద్రంటె పొద్దెక్కెదాక నోట్లె మంచినీల్లు పొయ్యరాయె" అని గిలాస ఇచ్చి లోపలికివోయింది.

"గివ్వి చెక్కినంక పైసలిచ్చుడేనా? ఏమన్నా ఒస్తులు పెడ్తరే బాపు" అనడిగిండు నర్సయ్య.

"బట్టలు పెడ్తరు బిడ్డా... ఆల్ల దయా ధర్మం... ఒక్కోపారి బావాజోల్లకు పెట్టినట్టన్న మాకు పెట్టరు. ఈ చేతులెన్ని బండల్ని చెక్కినయ్ బిడ్డా... ఎన్ని బండలకి పానాలు పోసినయ్... ఏ రాయిని చెక్కినా... ఏ దేవుడు మా బతుకుల్ని సల్లగా సూల్లేదు బిడ్డా... శిల్పాలు చెక్కెటోల్ల బతుకులు రాచ్చిప్పల్లెక్కనే పడేడ్తున్నయ్ గని... రాతినాలు దొర్కినయా... రాజీర్కం అచ్చిందా? ఎప్పుడు రాల్లవాన పడ్డట్టే

బిడ్డా...." అన్నడు వీరాచారి బాధగా.

"నిజమే వీరన్నా... గందుకే నా కొడుకులిద్దట్ల ఒక్కడన్న గీ పని నేర్సుకోలె. ఒకడు పెండ్లి వీడియోలు దీత్తుండు. ఇంకోడు డిష్ కనెక్షన్లు పెట్టుకున్నడు" అన్నడు రామసామి.

"నీ... మా బతుకులంత సక్కగున్నాయె రామన్నా... భూమిల ఇత్తునం పెట్టి ఆకాశం దిక్కు సూసుడేనాయె... నడుమ ఏ గాలి దుమారం ఏంజేత్తదో తెల్వదాయె" అన్నడు నర్సయ్య లేసుకుంట.

"పోతున్నవా బిడ్డ... దార్లె గా నారాయణను జెల్ది రమ్మను... ఆడు ఎత్మినాను మనిషి... లక్ష్మణుని విగ్రహం చెక్కే పని బాగున్నది" చెప్పిండు వీరాచారి.

రాముడి విగ్రహం దగ్గరికెళ్లి ఓపారి బట్టపేలుకతోని తుడిసి... టేపువెట్టి కొలిసిండు. ఉష్ణీష, కేశరేఖ, చెవి, ముక్కుకొన, చుబుకం, భుజాలు, ఛాతి, నాభి, మోచేయి, ఉరువు, మోచిప్ప, గిలకపాదం అన్ని కొలతలు తుర్తిగ సరిచేసుకున్నడు. కుడికాలిది బొటనవేలు కొంచెం పెద్దగనిపిస్తే సరిచేసుటానికి ఉలి సుత్తె చేతులకు దీస్కున్నడు.

అప్పుడే నర్సయ్య మల్లా వచ్చిండు.

" బాపూ... నారాయణ ఏడచ్చెటట్టున్నడే... ఆల్ల తాతని కిందేసింద్రు..." అన్నడు.

వీరాచారి గుండెల్లో రాయిపడింది.

ఉలి జారిపోయింది.

'కులపోడు... ఎంతైనా మూడ్రోజులన్నా ముట్టుడు తప్పది. ఇంక విగ్రహాలు

చెక్కద్దు' అనుకుంట రామసామిని తీసుకొని బయల్దేరిండు.

xxx xxx xxx

పిల్లలంతా క్రికెట్ ఆడుతున్నారు.

సుధాకర్ కొట్టిన బంతి గాల్లోంచి ఎగిరొచ్చి... బలంగా... పడుకొని వున్న రాముని విగ్రహాన్ని తాకింది. అదీ ముక్కుపైన....

చిట్‌మన్న శబ్దంతో... చెదిరిపోయింది రాముడి ముక్కు... యశోద ఇంట్లోంచి వచ్చేసరికి... అందరు పారిపోయిండ్రు... చెదిరిపోయిన విగ్రహాన్ని చూసి వణికిపోయింది యశోద.

"ఏ పోరడు జేసిండ్రా గీపని... తాత సూత్తె బతుకుతాడ్రా..." అని ఏడ్చుకుంట ఇద్దర్ని దొరుకవట్టింది.

మేం కాదంటే మేం కాదన్నారు...

"పసుపు బియ్యం పెడ్త... పోశమ్మ గుల్లె సాంరాలె... నిజం చెప్పుండ్రి" అని బెదిరిచ్చింది.

సుధాకర్ పేరు చెప్పిండ్రు...

లొల్లిజూసి వీరాచారి బయటికచ్చిండు. అప్పటికే యశోద కొడుకుని దొర్కిచ్చుకొని శోకం బెట్టుకుంట ఇరుగమొత్తింది.

"నీ అయ్యలెక్క నువ్వు కూడా జైల్లకువోయి బతుకురా... నీ కిర్‌కెట్ గంగలవోనూ, దేవుని ముక్కు ఇరుగ్గొడ్తివి గదరా మర్నాగి పోరడా..." అని తన్నింది.

వీరాచారి విగ్రహం దిక్కు చూసి... హతాశుడయ్యాడు.

పెయ్యిపొంట ముండ్లచ్చినయ్...

అంతకంటె ఎక్కువ యశోద, సుధాకర్‌ని సావుదెబ్బలు కొడుతుంటే తట్టుకోలేక పోయిండు... కోడలు చేతుల్లోంచి మనువన్ని తప్పించిండు. సముదాయించుకుంట...

యశోద కోపంగ క్రికెట్ బ్యాట్ తీసి పొయ్యిలవెట్టింది...

సుధాకర్ అది భరించలేక... తట్టుకోలేక బిగ్గరగా ఏడుస్తుండు. వీరాచారి గంటదాక కోలుకోలేడు. అటెనుక ధైర్నం తెచ్చుకున్నడు... 'విగ్రహాలు ఇచ్చుటానికి ఇంక పదిగేను రోజులున్నది... రాత్రింబగల్లు చెక్కితే మల్ల విగ్రహం తయారైతది' అనుకున్నడు. పాణాలన్ని బిగవట్టుకొని సుత్తె ఉలి దీసుకొని బోడగుట్ట దగ్గరికివోయిండు.

బోడగుట్టంతా దుమ్మురేగుతాంది.

కరకర కరకర చప్పుల్లు... పది పన్నెండు ట్రాక్టర్లు.. ఇరువై, ముప్పయ్, మంది కూలీలు... కొన్ని గుడిసెలు...

వీరాచారి పానం ఎల్లుకపోయింది... బోడగుట్టకు క్రషర్‌మిషన్లు పెట్టింద్రు... పెయ్యి నరాలు వణికినయ్... బండలు తరిగిపోతున్నయ్... కంకర కుప్పలు రాసులు పోసినట్టు... గుట్టలు మాయమయ్యే స్థితి...

పొలం కాన్నుంచి వస్తూ నర్సయ్య ఎదురుపడ్డడు.

"ఏందే బాపు... గట్ల బీరిపోయినవ్... నిన్ననే క్రషింగ్ మిషిన్లు పెట్టింద్రు...

గ్రాంపంచాయితోల్లు గుట్టను ఇరువై వేలకు గుత్తకిచ్చింండ్రట... నిన్నట్నించే బండలన్ని కంకరవడ్తండ్రు..." అన్నడు.

"నర్సీ... గిట్లెట్లయింది బిడ్డా... ఆ గుట్ట మా కులదైవంరా... అక్కడ ఏ బండనడిగినా మా బతుకుల గురించి చెప్తయ్‌రా... చివరికి... ఆ బండలు కూడా దక్కనిత్తలేర్రా... గుట్టల్ని మింగేకాలం దాపురిస్తదనుకోలేదురా.... రానురాను ఇగ గుట్టలు కొండలు కనవడయ్‌రా... వాటిని కూడా నమలక మింగే రోజులచ్చినయ్‌రా... అన్నడు.

కండ్లల్లకెల్లి నీల్లు జలజల రాలినయ్..

"ఊకోయే బాపు... నేను సర్పంచినడిగితేనే గుట్టను మీకేమన్న పట్ట జేసింండ్రా అన్నడు..." అని నర్సయ్య చెప్పిండు.

"గీ మిషిన్లు వెట్టి మా కులవృత్తిని దెబ్బ కొట్టింండ్రు బిడ్డా... కాని మీ నోట్లె కూడా మన్ను కొట్టింండ్రు గదరా..." అన్నడు దుఃఖంతో.

నర్సయ్యకు అర్థం కాలేదు.

"ఏంటిదే బాపు..." అన్నడు అనుమానంగా...

"బిడ్డా... నీకింకా సమజుకాలేదురా... ఆ దుబ్బను చూడ్రా... అదేమన్న మట్టిదుబ్బనారా... భూమిల కల్సిపోవుటానికి... రాల్ల దుబ్బరా... అది పొలాల్ల మేక్కపోతె... పచ్చగడ్డి కూడా మొలువదిరా... ఎందుకంటె అది పరుపుబండ లెక్క భూమ్మీద పేరుకపోతది.... బండ మీద ఏం పండుతయ్ బిడ్డా..." అన్నడు.

నర్సయ్యకి అప్పుడర్థమైంది.

నిజమే... రాళ్లను పిండిగా మారుస్తుంటె గాల్లోకి లేచిన ఆ రాల్లదుబ్బ పొలాల మీదకు ఎగజిమ్ముతోంది... పొలాలమట్టి బూడిద చల్లినట్టుగా అవుతోంది... అది క్రమంగా గట్టివడి పరుపుబండలాగా అయితే.. తమ పొలాలు..??

నర్సయ్యకి పూర్తిగా అర్ధమైనంక... ఆవేశమాగలేదు.

"రాయే బాపు... సర్పంచిగాని దగ్గరకు పోయి అడుగుదాం..." అన్నాడు.

"నువ్వెల్లు బిడ్డా... నాకు వూర్లెకి రాబుద్దయితలేదు..." చెప్పిండు దీనంగా. నర్సయ్య ఆవేదనగా... ఆవేశంగా వూర్లోకి నడిసిండు..

అర్దగంట తర్వాత... బోడగుట్ట దగ్గరి పాడువడ్డ బాయిల ఉలిని, సుత్తెని ఇసిరేసిండు వీరాచారి...

అటెనుక... 'దేవుడా... ఇగ బతుకద్దురా...' అనుకుంట దునికిండు.

XXX XXX XXX

ఆ రాత్రి... నర్సయ్యకు పాణమంత అగులుబుగులైంది... భార్యతోని అన్నడు "ముసలోడు చచ్చిపోతడనుకోలేదే... రాంగవోంగ మందలిచ్చెటోడు... క్రషర్ మిషన్ కాంట్రాక్టర్ గాడు ఊరికి ఇరువై వేలియ్యంగనే... గుట్టనే అప్పజెప్పింద్రు"

"మన పొలం గతెట్ల..." అంది నర్సయ్య భార్య.

"ఏం లేదు... పోయి అన్నల్ని కలుత్త" అన్నడు కోపంగ.

"అల్లంత నియ్యతిగున్నరా తియ్... మొన్న గా కాంట్రాక్టర్ కీర్తాండరావ్‌ని ఎత్తుకపోయి... కోటి రూపాయిలిత్తె ఇడిసిపెట్టింద్రట... గీ క్రషర్‌మిషన్ గూడా గాయినదేనట.... ఇగ అల్లకు జెప్పుకోని పాయిదేంది?" అన్నది నిట్టూరంగా...

నర్సయ్యకు ఏం చేయాల్నో అర్థం కాలేదు. పొలాన్ని కాపాడుకోవాలె అని రాత్రంతా నిద్రవోలేదు.

తెల్లారి... బామ్మర్ది దగ్గరికి సింగరేణి వోయిండు... బొగ్గు బాయిల పని చేసే డిటోనేటర్లు సంపాయించుకొని రాతిరి వరకచ్చిండు.

అద్మరాత్రి... పెట్రోల్‌క్యాన్ దీసుకొని పోయిండు....

చిమ్మెట్ల సప్పుడు తప్ప అంత నిశ్శబ్దంగా వుంది... అక్కడున్న నాలుగు ట్రాక్టర్ల మీద పెట్రోల్ వోసిండు... మిషిన్లల్ల డిటోనేటర్లు వెట్టిండు... తీగెనంటు వెట్టిండు....

ఒక్కసారి ఆ ఏరియంత భగ్గుమన్నది. భూమి బద్దలైనంత విస్ఫోటనాలు... ట్రాక్టర్లు కాలుకుంట మంటల్లేసినయ్...

"నీయవ్వ... నక్సలైట్లల్ల నాలుగు వర్గాలున్నయ్... ఎవలో ఒకలు గీ పని చేసిండ్రనుకుంటరు... నాకు నా పొలం దక్కాలె... అందరి పొలాలు దక్కాలె... రైతు బతుకాలె..."

తుర్తిగా ఊర్లెకి నడిసిండు.

*